క్లుప్తంగా

బి.కొత్తకోట కమిషనర్‌గా మనోహర్



బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్‌గా పీఆర్.మనోహర్‌ను నియమిస్తూ గురువారం మున్సిపల్‌శాఖ డైరెక్టర్ పి.కోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీసత్యసాయిజిల్లా కదిరి మున్సిపాలిటీలో కేటగిరి–1 మేనేజర్‌గా పనిచేస్తున్న మనోహర్‌కు ఇక్కడ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుత కమిషనర్ నరసింహప్రసాద్ పుంగనూరు కమీషనర్‌గా ఉంటూ బి.కొత్తకోట నగర పంచాయతీకి ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారు.

26న జాబ్‌మేళా



మాట్లాడుతున్న ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్

వాల్మీకిపురం: పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 26వ తేది జరగనున్న జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైన యువతకు 3500మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి వలంటీరు తమ పరిధిలోని నిరుద్యోగులను గుర్తించి జాబ్‌మేళాకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న పాలవెల్లి కార్యక్రమం కింద పని చేయని పాల కేంద్రాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం నరసింహులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

నేడు బూచిపల్లిలో పల్లెబాట

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూచిపల్లి పంచాయతీలో శుక్రవారం పల్లెబాట కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

జూదరుల అరెస్ట్

బి.కొత్తకోట: స్థానిక పీటీఎంరోడ్డులోని పెద్దమ్మగుడి సమీపంలో పేకాడుతున్న వారిపై గురువారం దాడులు చేసినట్లు ఎస్‌ఐ రామమోహన్ తెలిపారు. ఈ దాడిలో పదిమందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.24, 150ల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

19న గండికి స్పెషల్ బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: శ్రావణ శనివారం పురస్కరించుకుని ఈ నెల19న గండి (ఆంజనేయస్వామి) క్షేత్రానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. మదనపల్లె డిపో నుంచి ఉదయం 5.20 గంటలకు బయలుదేరుతుందన్నారు. తరువాత గాలివీడు నుంచి గండికి షటిల్ సర్వీసు నడుపుతామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జవహర్ నవోదయలో ప్రవేశానికి గడువు పెంపు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 25 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. అలాగే ఈనెల 26,27 తేదీల్లో దరఖాస్తుల్లో వివరాలు సవరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న పార్టీ నేతలు

పీలేరు : వీసీకే పార్టీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ తోల్ తిరుమావలన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు స్థానిక సదుం మార్గంలోని లక్ష్మీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో వీసీకే పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణయ్య, మల్లికార్జున, గురురునాథ, వేణు పాల్గొన్నారు.

కేశాలు దానం

మదనపల్లె సిటీ: క్యాన్సర్ బాధితుల మోముల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా గురువారం ఆంజనేయస్వామిగుడివీధికి చెందిన మునీరా, నీరుగట్టువారిపల్లెకు చెందిన విద్యార్థిని తనుశ్రీలు హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్దిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ గిరీషా పీఎస్
- నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వద్దు: ఎమ్మెల్యే



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్, చిత్రంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసి నియోజకవర్గ అభివృద్ధికి సమన్వయంతో బాధ్యతగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా.పి.ఎస్. అధికారులను ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి కలెక్టర్ నియోజకవర్గ స్థాయి రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 22న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాకానిగోవర్ధన్‌రెడ్డి మదనపల్లెలో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి హాజరవుతారన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు వీలుగా అధికారులు అవసరమైన సమాచారంతో సమావేశానికి హాజరుకావాలన్నారు. గ్రామసచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ విలేజ్‌క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పాలకేంద్రం తదితర ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, పనుల్లో నాణ్యతాలోపాలు లేకుండా జాగ్రత్తపడాలన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. మదనపల్లె నియోజకవర్గంపై సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక అభిమానాన్ని కనపరుస్తూ వేలకోట్ల సంక్షేమ, అభివృద్ధి పనులను మంజూరు చేశారన్నారు. వాటన్నింటినీ నాణ్యతతో, సకాలంలో పూర్తిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అభివృద్ధిపనుల్లో అధికారులు నిర్లక్ష్యం కనపరచవద్దని, నాడు–నేడు పనులకు సంబంధించి నియోజకవర్గంలో 112 పాఠశాలల్లో పెండింగ్ పనులను పూర్తిచేయాలన్నారు. డిసెంబర్ చివరికల్లా ఇంటింటికీ కొళాయి కనెక్షన్లు పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, డిప్యూటీ కలెక్టర్ సందీప్, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్‌లు మహబూబ్‌చాంద్, సీ.ఆర్.మంజుల, దైవరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు మేలు



ప్రేమలత,ఏఓ

పెద్దతిప్పసముద్రం: వర్షాభావం నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి ప్రేమలత సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక పంటల సాగు కన్నా తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో చిరు ధాన్యాల సాగుపై దృష్టి సారిస్తే రైతులకు మరింత ప్రయోజనకరమన్నారు. చిరు ధాన్యాలు 90–120 రోజుల మధ్యలో చేతికి వస్తాయని వాటికి మార్కెట్‌లో కూడా డిమాండ్ ఉంటుందన్నారు. ప్రభుత్వం 80 శాతం రాయితీతో రైతులకు ఉలవలు అందజేస్తోందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఏ రైతు ఏ పంట, ఏ సర్వే నంబర్‌లో సాగు చేసాడు ఫొటోలు తీసి ప్రభుత్వ యాప్‌లో వివరాలను సమగ్రంగా అప్‌లోడ్ చేస్తామని ఏవో వివరించారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని బూర్లపల్లి సచివాలయం ఎదుట గురువారం పశువులకు సోకే ముద్ద, చర్మ వ్యాధిపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. స్థానిక సర్పంచ్ బుచ్చిగారి సుబ్బిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో పశుసంవర్ధక శాఖ సహాయకుడు ప్రవీణ్ మాట్లాడుతూ పాడి పశువులలో సూక్ష్మాతి సూక్ష్మమైన వైరస్ సోకితే శరీరమంతా చర్మంపై బొబ్బలు వ్యాపిస్తాయన్నారు. ఈ వ్యాధి వల్ల పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. అనంతరం 350 పశువులకు ముద్ద చర్మ వ్యాధి నిరోదక టీకాలు వేశారు.

టీకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



డాక్టర్లు, వైద్య సిబ్బందితో డాక్టర్ ఉషశ్రీ

తంబళ్లపల్లె: ప్రభుత్వం అమలు పరుస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఉషశ్రీ ఆదేశించారు. గురువారం ఆమె కోసువారిపల్లె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వ్యాధినిరోధక టీకా కార్యక్రమ అమలుపై రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సమాచారంపై ఏఎన్‌ఎంలతో ఆరా తీశారు. గర్భిణులు, చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా ఈ వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలన్నారు. చిన్నపిల్లలు ఎవరైనా టీకాలు వేయించుకోకుంటే వారిని గుర్తించి టీకా వేయాలన్నారు. సీజనల్ వ్యాధులు, పోలియో వ్యాక్సిన్ అంశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ మునికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెబాటను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

తంబళ్లపల్లె: మండలంలో ఈ నెల 21వ తేదీ నుంచి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగే పల్లెబాట కార్యక్రమాన్ని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం జరిగింది. 21 నుంచి సెప్టెంబర్ 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్నిశాఖల అధికారులు వారివారి శాఖపరిధిలో ఇప్పటి వరకు పూర్తిచేసిన అభివృద్ధి పనులు, జరుగుతున్న పునులు, చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల నివేదికలతో అధికారులు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ సమావేంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఎమ్మెల్యే పీఏ మస్తాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలి

కలికిరి: ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ వసుంధర అన్నారు. ఈ నెల 10న నిర్వహించిన నులిపురుగుల దినోత్సవం రోజున పాఠశాలలకు గైర్హాజరైన పిల్లలకు గురువారం ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలికిరి మండల పరిధిలోని రాజువారిపల్లి మదరసా, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల, తేరువీధిలోని అంగన్వాడీ కేంద్రం, ప్రైవేటు పాఠశాలలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. 19 ఏళ్లలోపు వయస్సు గల ప్రతి ఒక్కరు ఏడాదికి రెండు సార్లు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకుంటే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ అధికారి డాక్టర్ శేషగిరి, ఆర్‌కేఎస్‌కే కో–ఆర్డినేటర్ ఇంతియాజ్, హెచ్‌ఈ మహ్మద్ రఫీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త పథకాలు అమలు చేస్తూ రాష్ట్రంలోని ప్రతి కుటుబానికి ఆర్థిక భరోసా కల్పించారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే పీలేరు పట్టణం చెన్నారెడ్డి వీధి, ఎస్వీ డీలక్స్ రోడ్డులో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయడంతోపాటు ఎన్నో కొత్త పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. పేదోడి కళ్లల్లో ఆనందం చూడాలని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పరితపించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. నవరత్నాల పథకాలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని, రాష్ట్రంలో సువర్ణ పరిపాలన కొనసాగాలంటే ప్రజలు మద్దతు ఉండాలన్నారు. తాము నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామని, ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తెచ్చిన సమస్యలు తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు విక్టరీ వెంకటరమణారెడ్డి, చక్రధర్, మహితా ఆనంద్, అనురాధ, అరుణ, ఉదయ్‌కుమార్, శ్రీనాథరెడ్డి, జయపాల్, గడిబాషా, షాకీర్, బలసావేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, కాలనీ చిన్న, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని నిమ్మనపల్లె పంచాయతీ నాగులయ్యగారిపల్లె, మద్దిరెడ్డిగారిపల్లె, మల్లేశ్వరపురం, అడుసుపల్లె, గంగాపురంపల్లె, గుడిపల్లి, తిమ్మాపురం, జల్లావారిపల్లె తదితర గ్రామాల్లో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగన్నరేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించే బుక్‌లెట్లను అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసీం, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, నాయకులు యుగంధర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నవీన్, గోపాలకృష్ణ, మహమ్మద్‌రఫీ, లక్ష్మన్న, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు, ఉపాధిహామీ ఏపీడీ మధు బాబు, హార్టికల్చర్ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, ఎస్‌ఐ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

కలకడ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఎస్టీయూ లక్ష్యమని ఎస్టీయూ సంఘం అన్నమయ్య జిల్లా మాజీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కె.బాటవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రత్యేక శ్రద్ధ చూపిన ప్రభుత్వం ఉపాధ్యాయులకు అందాల్సిన న్యాయమైన జీతభత్యాలు సైతం సకాలంలో అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీజీఎల్ఐసీ ఫైనల్‌సెటిల్‌మెంట్ జాప్యాన్ని నివారించి వెంటనే విడుదల చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ త్వరలో సంబంధిత బడ్జెట్ ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జనార్దన్‌రెడ్డి, సరస్వతిరెడ్డి, వైవిరమణ, ఎ.వేణుగోపాల్‌రెడ్డి, సదాశివరెడ్డి, శ్రీనివాసరావ్, సుబ్రమణ్యం, శ్రీనివాసులురెడ్డి, బాబురెడ్డి, ఆంజినేయులు, శీను, శివారెడ్డి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

టీబీని నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యాధికారి శైలజ

పీలేరురూరల్ : టీబీ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ శైలజ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో టీబీ, లెప్రసీ కార్యక్రమాలపై ఆరోగ్య సిబ్బంది, సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ ముక్త పంచాయతీ గురించి వివరించారు. టీబీకి ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, సూపర్‌వైజర్లు మోహన్, పవన్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నులిపురుగులను నిర్మూలిద్దాం

కలకడ : వందశాతం చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించడమే జాతీయ నులిపురుగుల మాప్ ఆప్ డే లక్ష్యమని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు, మల్లికార్జున, మోహన్ అన్నారు. గురువారం మండలంలోని యర్రయ్యగారిపల్లె, ఎర్రకోటపల్లె, కదిరాయచెర్వు ఉన్నతపాఠశాల, దేవులపల్లె, ముడియంవారిపల్లె, కలకడ ఉర్దూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో చిన్నారులకు వందశాతం మాత్రలు పూర్తయిందా లేదా అని తనిఖీ చేశారు. యంపీహెచ్‌ఈఓలు జయరామయ్య, వెంకటేశు, రాజమ్మ, వాణి, బాగ్యమ్మ, అంజనమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా చాప్ కట్టర్లు



రామసముద్రం: రామసముద్రం మండలంలోని పాడి రైతులకు గడ్డికత్తిరించే యంత్రాలు (చాప్‌కట్టర్లు) పంపిణీ చేయనున్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు. పశువైద్యశాఖ పాడి రైతులకు ప్రభుత్వం రాయితీపై చాప్ కట్టర్లను అందజేయనుంది. ఇందులో భాగంగా 2హెచ్‌పి కెపాసిటి కలిగిన 51 చాఫ్ కట్టర్లు మండలానికి వచ్చాయన్నారు. ఒకొక్క చాప్ కట్టర్ మొత్తం విలువ రూ.33,970లు ఉండగా రూ.13,583 లు ప్రభుత్వం సబ్సిడి పోను రైతులు రూ.20,382లు డీడీ రూపంలో చెల్లించారు. డిడి చెల్లించిన 51 మంది రైతులకు త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు పశువైద్యాధికారులు తెలిపారు.

మన్యంరాజు సందేశాత్మక చిత్రం



శ్రీకృష్ణ థియేటర్ వద్ద మన్యంరాజు యూనిట్

మదనపల్లె సిటీ: యువత చెడుదారి పట్టకుండా మంచి దారిలో నడవాలని ఉద్దేశంతోనే మన్యంరాజు చిత్రం నిర్మించినట్లు ఆ చిత్ర దర్శకుడు సోముసుందర్ తెలిపారు. గురువారం స్థానిక కృష్ణ థియేటర్‌లో మన్యంరాజు చిత్రం విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమాను తిలకించారు. చిత్ర దర్శకుడు సోముసుందర్ మాట్లాడుతూ నేటి యువత గంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. యువతలో మార్పు రావాలన్న ఉద్దేశంతోనే మన్యంరాజు చిత్రం నిర్మించినట్లు పేర్కొన్నారు. ప్రేక్షకులు సినిమాను ఆదరించాలని కోరారు. ఇందులో ఎస్.ఐగా మదనపల్లెకు చెందిన మురళి ప్రధాన పాత్ర పోషించారన్నారు. సినీ హీరో జీవన్‌రెడ్డి, మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు మురళీ పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే వేగవంతం



మాట్లాడుతున్న తహశీల్దార్

పీలేరు రూరల్ : ఓటర్ల జాబితాపై ఇంటింటి సర్వే వేగవంతం చేయాలని తహశీల్దార్ ధనుంజయలు అన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 56,682 ఓటర్లకు గానూ 53,615 ఓటర్ల సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలినవి ఈ నెల 21వలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు చేయడమే లక్ష్యంగా సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. డీటీ సుబ్రమణ్యం, వీఆర్‌వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక

ములకలచెరువు: ములకలచెరువు మండల ఎస్టీయూ నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. కమిటీ మండలాధ్యక్షుడిగా వెంకటరమణ, ప్రధానకార్యదర్శిగా సుబ్బరాయప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమరనాథ్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీరాములు, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

కలికిరి: ప్రభుత్వ అనుమతికి మించి మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మాబూ సాహెబ్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుట్టపాళెం గ్రామం వాడావాండ్లాపల్లికి చెందిన వెంకటరమణ రూ.4170 విలువ గల 18 బ్రాందీ బాటిళ్లు, ఏడు బీరు బాటిళ్లు తరలిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితున్ని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పరిమితికి మించి మద్యం తరలించకూడదని ఏఎస్‌ఐ తెలిపారు.

ఈసారీ వైఎస్సార్ సీపీదే అధికారం

- జేసీఎస్ నమోదు శిబిరంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి, జగనన్న పాలనపై ప్రజల్లో వ్యక్తమవుతున్న సంతృప్తితో 2024లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం తథ్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. వైఎస్సార్ సీపీ ఫ్యాన్ ధాటికి సైకిల్, జనసేన గల్లంతవడం ఖాయమని, ఎల్లోమీడియా దుష్ప్రచారాలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో మదనపల్లె టౌన్, రూరల్, నిమ్మనపల్లె జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు మునిశేఖర్, బావాజీ, పోతబోలు నాగరాజ, రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న – జేసీయస్ నమోదు శిబిరం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ నూర్‌ఆజం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వైఎస్సార్ సీపీ ఇస్తున్న భరోసా, భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ప్రతి వార్డుకు ముగ్గురు సచివాలయ కన్వీనర్లను నియమించామని, వీరు గృహసారథులతో సమన్వయం చేసుకుని, వలంటీర్లతో కలిసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. పార్టీ గెలుపు బాధ్యత కన్వీనర్ల భుజస్కంధాలపైనే ఉందని, ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి డీబీటీ పథకం ద్వారా పారదర్శకతతో నేరుగా ప్రజల ఖాతాల్లోకి డబ్బులు జమచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని, వారికి జగనన్న పాలనలో కలిగిన లబ్ధిని వివరిస్తే 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

2014లో చంద్రబాబు 600 అబద్ధపుహామీలతో మేనిఫెస్టో విడుదల చేసి ఒక్క హామీని అమలుచేయకపోగా, ప్రజలను నిలువునా ముంచారన్నారు. 2019లో జగనన్న కేవలం రెండు పేజీల మేనిఫెస్టోతో 100శాతం హామీలను నెరవేర్చి ప్రజల మనస్సుల్లో నిలిచిపోయారన్నారు. వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లకు భరోసాగా ఇస్తున్న రూ.10లక్షల బీమా సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరురఫీ, షరీఫ్, వార్డు కౌన్సిలర్లు బి.ఎ.ఖాజా, మేస్త్రీశ్రీనివాసులు, ఎస్వీ.రమణ, రామిశెట్టిశివయ్య, పాల్‌చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణపై రైతులకు అవగాహన

కలికిరి: పంటలలో తెగుళ్ల నివారణ, కలుపు యాజమాన్య పద్దతులపై కేవీకే, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని చీకటిపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. పంట పొలాల సమీపాల్లో వయ్యారిభామ నివారణ చేపట్టాలన్నారు. వయ్యారిభామతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వేరుశనగ, వరి పంటలలో తెగుళ్ళ నివారణకు చేపట్టాల్సిన నివారణ పద్దతులను వివరించారు. డీఆర్సీ ఏడీఏ శ్రీకాంత్, ఎఓ మమతారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పెట్రోలు బంకు ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

కలికిరి: పట్టణ పరిధిలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గల పోలీస్‌క్వార్టర్స్ స్థలంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు గానూ చుట్టుపక్కల నివాసాలున్న వారి నుంచి గురువారం తహశీల్దారు భాగ్యలత అభిప్రాయ సేకరణ చేశారు. ఉన్నతాధికారుల నుంచి అందిన ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన నివేదికను పంపనున్నట్లు తహశీల్దారు పేర్కొన్నారు.వీఆర్‌ఓ విశ్వనాథ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

రాయచోటి :రోడ్డు ప్రమాదంలో మరణించిన పోలీసు బాధిత కుటుంబానికి ఎస్పీ ఆర్.గంగాధర్ రావు చేతులమీదుగా రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. గురువారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో మృతుడి తండ్రి టి.శ్రీరాములుకు చెక్కును ఎస్పీ అందజేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న టి.ప్రసన్న కుమార్ ఈనెల 2న రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. పోలీసు వితరణ నిధి నుంచి ఈ ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మరణించిన సిబ్బంది కుటుంబాల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డీపీఓ ఏఓ కృష్ణుడు, సూపరింటెండెంట్ పీవీ ప్రసాద్‌లు పాల్గొన్నారు.